'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ఎవరైనా ఆడిన మాట తప్పితే!

చరిత్రలో నిషేధాలెప్పుడు
సత్ఫలితాలివ్వలే
ఒక నోరు మనం ఇక్కడ మూయిస్తే
వేయి నోళ్లు మరోచోట విచ్చుకుంటాయి!
అతను ఒక వ్యక్తిలా గాక
సామూహిక శక్తి అయినప్పుడు
చౌరాస్తాలన్నీ జన సంద్రాలవుతాయి!
యుద్ధం మొదలైనప్పుడు
తప్పటడుగు ఎంత చిన్నదైనా
ఫలితాలను తలకిందులు చేస్తుంది!
ఎవరైనా ఆడిన మాట తప్పితే
జనం ఆగ్రహంతో ఊగిపోతారు!
ఎక్కడా అణచివేతలకు
విజయాలు దక్కిన దాఖలాలు లేవు!
నిప్పులు రాజేసినంక
నిటలాక్షుడైనా ఆర్పలేడు!
విజయాలు వినయమివ్వనప్పుడు
విలయాలకు సిద్ధమవ్వాల్సిందే!
భంగపడ్డ వాని మౌనం
శత్రువుల ఊహకందదు!
గాలివాటం విజయాలకు
ఈ ఎన్నికలు ఒక లిట్మస్ టెస్టు!

కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

తెలంగాణవాది అంతరాత్మ ఘోష

'నాకు బీఆర్ఎస్‌లో ''మా నాయన'' కేసీఆర్ నుంచి సామాన్య కార్యకర్త వరకు ఎవరితోనూ ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు లేవు (my love on KCR is unconditional)'... అంటూ ఒక అమ్మాయి (ఇద్దరు పిల్లల తల్లి) రాసిన వ్యాసం చూశాక నా కళ్లల్లో కన్నీళ్లు తిరిగాయి. (ఇవి ఆనందభాష్పాలా! బాధతో వచ్చినవా? అనేది మీరే నిర్ణయించుకోండి). ఆ వ్యాసాన్ని ఎన్నిసార్లు చదివానో, ఎంతగా సంతోషపడ్డానో నాకే తెలుసు. తదుపరి ఆ భగవంతునికే తెలుసు. ఎందుకంటే నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయం. దీన్ని మళ్లీ, మళ్లీ చెప్పుకోవాల్సిందే. ఎందుకంటే, ఆ విషయాలు ఇప్పటి యువతరానికి తెలియదు.

చెన్నమనేని హన్మంతరావు

నష్టపోయిన తెలంగాణీయులలో నేనొకడిని కాబట్టి, పదేండ్ల తర్వాత మార్పును కోరిన సమాజానికి, నేడు అనుభవిస్తున్న పరిస్థితులకు కారణాలు చెప్తూ, జరిగిన అన్యాయాల్ని మళ్లీ మళ్లీ చెప్పాల్సి వస్తున్నది. కొంతకాలంగా తెలంగాణ యువతను చూస్తే భయమేస్తున్నది. ఎందుకంటే, తెలంగాణను వీళ్లు రక్షించుకుంటారా? మళ్లీ నక్కల, కుక్కల పాలు చెయ్యరు కదా అని అనుమానం, ఆవేదన. యువతది తప్పు కాదు, ఎందుకంటే ఆ చీకటి కాలాన్ని వారు అనుభవించలేదు. కొంతమంది చూసి ఉంటారు కానీ, అనుభవంలోకి రాలేదు. సగటు తెలంగాణ అనుభవించిన అవమానాలు, దోపిడీలు వారికి తెలియవు.

'ఏంటండి చొక్కారావు గారు, తెలంగాణకు వచ్చే ''కోట్లా''. ఏం కోట్లండి పాత కోట్లా? కొత్త కోట్లా చెప్పండి తెప్పిస్తాను' ఇలాంటి అవమానాలు. ఇది మాజీ ముఖ్యమంత్రి ఒకాయన మన నాయకులతో మాట్లాడిన ఎకసెక్కపు మాటలు. మరొక ద్రోహపు ముఖ్యమంత్రి.. 'తెలంగాణకు ఒక్క పైసా కూడా ఇవ్వను! ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి' అని అసెంబ్లీ సాక్షిగా మాట్లాడిన దుర్మార్గపు మాటలు.

ఈ మాటలు మాట్లాడినవారు ఇంకా హైదరాబాద్ వస్తూ అక్కడక్కడ కనబడుతుంటే, నాకప్పుడు ఎంత మండుతుందో నాకే తెలుసు. ఈ మాటలు ఎలా మరుపునకు వస్తాయి. గమ్మతు ఏమంటే.. ఉద్యమంలో పాల్గొన్నవారు కూడా వాటిని మరిచిపోయారు. వాటిని అనుభవించివాళ్లు, నాలాంటివాళ్లు ఏ కొద్దిమందో జీవించి ఉన్నారు. ద్రోహులు బతికే ఉన్నారు. తెలంగాణ ప్రజలు జరిగిన అవమానాల్ని, నష్టాల్ని మరిచిపోతున్నారు. ఇదీ మా బాధ.

ఇక కేసీఆర్ లాంటివారు రాష్ట్రాన్ని ఎలా పునర్నిర్మాణం చేయాలో రాత్రి పగలు ఒక్కొక్క అనుభవశాలితో చర్చిస్తుంటే.. 'నన్ను కలువలేదు. అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. కబుర్లు చెప్పలేదు' అని కొందరి అవస్థ. కలవకపోతే దొరల పాలన, గడీల పాలన అంటూ కులం పేరుతో, మతం పేరుతో తిట్లు. ఇదా తెలంగాణ అంటే ప్రేమ. పెంటలపై కాగితాలు ఏరుకునేవాళ్లు కూడా నాయకులై రాష్ట్రమంటే ఏ మాత్రం ప్రేమ, అభివృద్ధి ధ్యాస లేకుండా పిచ్చి వదుర్లు వదురుతుంటే మాలాంటివారికి ఎలా ఉంటుంది. వాళ్లనోరు ఎలా మూయించగలం. ఆ మాటల మాయలో పడి ఎవరు ద్రోహులు? ఎవరు శ్రేయోభిలాషులు? అని అర్థం చేసుకోక తనకున్న పవర్‌ను వ్యర్థపరుచుకుంటే సగటు తెలంగాణ వాసి రేపెట్లా పైకొస్తాడు. సరైన ఆలోచన లేకుండా తికమక పడితే ఎలా? వీటిని చూస్తుంటే మావంటి వయసు మళ్లిన వారికి కలిగిన బాధ ఎవరికి చెప్పుకోవాలి. ఇదిగో ఇలా ఈ పత్రిక ద్వారా చెప్పుకొంటున్నాం.

ఇలాంటి సమయంలో మొన్నటి వ్యాసం మండుటెండలో పన్నీటి చిలకరింపులా హాయి కలిగించింది. ఆ అమ్మాయి ఎంతబాగా విశ్లేషణ చేసింది. ఎంతబాగా వివరణ ఇచ్చింది. నీ వివరణతో మా కడుపు నిండిందమ్మా! ఏం పర్వాలేదు నా తెలంగాణను కాపాడుకునే యువత మేల్కొనే ఉంది. సమయం వచ్చినప్పుడు రుద్రుడై, రుద్రమలై విజృంభిస్తారనే నమ్మకం కలిగింది.

పక్కనున్న రాష్ట్ర ప్రజలు చాలా మంది మంచివారే. వారిలో అత్యాశలు ఏం కనిపించవు. కొందరికి మాత్రమే తెలంగాణకు వచ్చి దోచుకొని, తమవారికి పెట్టుకోవాలనే దురాశ. ఇందులో కొందరు 'నాదిర్షా'లు, కొంతమంది 'ఘోరీ'లు ఇంకా బతికే ఉన్నారు. వారి ఓ కన్ను తెలంగాణపై ఉంచారనే అనుమానం విచారించాల్సిన విషయం. వారికి కొందరు తెలంగాణవాళ్లే సహాయం, సహకారం చేస్తున్నారని అనుమానం. తెలంగాణవాళ్లే వారికి సహాయ పడుతుంటారు. అందుకే వారు కనుమరుగయ్యే వరకు మాలాంటివాళ్లు భయపడుతూనే ఉంటాం అమ్మాయి. వ్యాసం చాలా బాగుంది. నీ బహిరంగ లేఖ యువతకు కనువిప్పు, మేల్కొలుపు కావాలి. ఇంటాబయట ఉన్న తెలంగాణ ద్రోహులకు సింహస్వప్నం కావాలి. మాలాంటివారు ఈ తెలంగాణ భూమిని శాశ్వతంగా విడిచే వేళ తృప్తిగా వెళ్లిపోవాలి.

(వ్యాసకర్త: పూర్వ రిజిస్ట్రార్, తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి)

చార్‌సౌ పార్... పరార్

2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు 'మేము 400కు పైగా సీట్లు సాధిస్తాం' అని ప్రధాని నరేంద్ర మోదీ ధీమాగా చెప్పారు. ఆయనకు బీజేపీ నాయకులూ వంత పాడారు. కానీ, ఒక్కో దశ పోలింగ్ ముగుస్తున్న కొద్ది చార్‌సౌ పార్ నినాదం పరారైంది.

బుద్ధా మురళి

ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు మొత్తం ఏడు విడతలుగా జరుగనున్న ఈ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే మూడు విడతల పోలింగ్ ముగిసిన విషయం తెలిసిందే. 'స్థానికంగా ఎవరు గెలుస్తారనేది ముందుగా పోలీసులు పసిగడతారు' అని రాజకీయాల్లో ఓ బలమైన నమ్మకం ఉన్నది. అలాగే దేశంలో రాజకీయ పరిస్థితిని, రాజకీయ పక్షాల జయాపజయాలను స్టాక్‌మార్కెట్ ముందుగానే పసిగట్టడమే కాకుండా దానికి తగ్గట్టు స్పందిస్తుంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు నెలల కిందట బీజేపీ విజయం సాధించడం, బీహార్‌లో అధికారంలో ఉన్న నితీష్ కుమార్ ఎన్డీయేలో చేరడంతో బీజేపీకి ఇక ఎదురులేదని స్టాక్‌మార్కెట్ పరుగులు తీసింది. బీజేపీ సైతం ఈ విజయం తర్వాత ఈసారి 400 సీట్లలో విజయం సాధిస్తామని బలంగా ప్రచారం చేసుకున్నది. కానీ, పోలింగ్ దగ్గరపడుతున్న కొద్ది బీజేపీ 400 సీట్ల నినాదాన్ని పక్కనపెట్టి మతపరమైన చీలిక ద్వారా ఓట్లు సాధించడంపైనే ఎక్కువగా దృష్టి సారించింది. పదేండ్ల పాలనాకాలంలో తాము సాధించిన విజయాలు, ప్రజలకు చేసిన మేలు వల్ల 400 సీట్లు సాధిస్తామని కమలం పార్టీ ఎప్పుడూ భావించలేదు. ఆ కోణంలో ప్రచారం కూడా చేసుకోలేదు. మతంపైనే ఆ పార్టీ ఎక్కువగా ఆధారపడుతున్నది. బీజేపీ కోణంలో చూస్తే అది సరైన వ్యూహమే. పదేండ్ల పాలనలో చెప్పుకొనేందుకు ఏముంది? ఏమీ లేనప్పుడు ప్రజలెందుకు ఓటు వేస్తారు? అదే మతం కోణమైతే విజయానికి దగ్గరి దారి అవుతుంది. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి విజయం సాధించవచ్చు. తొలి విడత పోలింగ్ తర్వాత ప్రధాని కూడా తన ప్రచార తీరును మార్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ హిందువుల సంపదను లాక్కొని ముస్లింలకు ఇస్తుందనే విచిత్ర ప్రచారాన్ని ఆయన నమ్ముకున్నారు. మంగళసూత్రాన్ని హిందూ మహిళలు పవిత్రంగా భావిస్తారు. మోదీ తన ప్రచారంలో మంగళసూత్రాలను సైతం వాడుకుంటున్నారు. 'మీ మెడలో ఉన్న మంగళసూత్రాలను కూడా కాంగ్రెస్ వదిలిపెట్టదు, ముస్లింలకు దోచిపెడుతుంది' అని మోదీ ఎన్నికల ప్రచారంలో ఓ వర్గాన్ని రెచ్చగొడుతున్నారు. ఈ రెచ్చగొట్టే ప్రచారాన్ని ఎన్నికల కమిషన్ మౌనంగా చూస్తున్నది. ఒకప్పుడు బలంగా ఉన్న వ్యవస్థలు ఇప్పుడు ఎలా పని చేస్తున్నాయో దీన్నిబట్టే అర్థమవుతున్నది.

1991లో పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు అమలులోకి వచ్చిన ఆర్థిక సంస్కరణలే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కొనసాగించాయి. యూపీఏ, ఎన్డీయే, బీజేపీ ఎవరు అధికారంలోకి వచ్చినా ఆ విధానాలు అలాగే కొనసాగుతున్నాయి. రెండు సార్లు అధికారంలోకి వచ్చిన మోదీ అవే విధానాలను కొనసాగించారు. ఎవరు వచ్చినా అవే విధానాలు కొనసాగించక తప్పదు. అయితే స్థిరమైన ప్రభుత్వం ఉండాలని స్టాక్‌మార్కెట్ కోరుకుంటుంది. బీజేపీ 400 సీట్ల ప్రచార ప్రభావంతో దూసుకెళ్లిన స్టాక్‌మార్కెట్ పోలింగ్ తర్వాత ఇప్పుడు ఊగిసలాడుతున్నది. తొలి విడత పోలింగ్ నుంచి ఇదే వైఖరి. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి తొలి విడత పోలింగ్‌లో దాదాపు రెండు శాతం తక్కువ ఓటింగ్ జరిగింది. తొలుత ఎనిమిది శాతం వరకు తక్కువ పోలింగ్ జరిగినట్టు వార్తలు వచ్చాయి. వాస్తవ అంకెలు రావడానికి సమయం పడుతుంది. అయితే ఎనిమిది శాతం తక్కువ పోలింగ్ అనే వార్తలు వచ్చినప్పటి నుంచి స్టాక్‌మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతిన్నది. మూడు విడతల పోలింగ్‌లోనూ గతంలో కన్నా తక్కువ పోలింగ్ శాతం నమోదైంది. గురువారం (మే 9) స్టాక్‌మార్కెట్ సూచీ సెన్సెక్స్ 1,062 పాయింట్లు పడిపోయింది. వరుసగా ఏడు సెషన్లలో సెన్సెక్స్ 1,900 పాయింట్లు పడిపోయింది. దీంతో దాదాపు 15 లక్షల కోట్ల రూపాయల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. మరోవైపు ఫారెన్ ఇన్వెస్టర్లు జోరుగా అమ్మకాలు సాగిస్తున్నారు. మే నెలలో ఇప్పటివరకు రూ.15,863 కోట్ల వరకు స్టాక్స్ నగదు మార్కెట్‌లో, రూ.5,200 కోట్ల వరకు ఫ్యూచర్ మార్కెట్‌లో అమ్మకాలు సాగించారు.

అమెరికాకు చెందిన అంతర్జాతీయ ఫైనాన్సియల్ సర్వీసెస్ సంస్థ జెఫ్రీ 70 శాతం వరకు ప్రస్తుత ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని, ఒకవేళ అధికార పక్షం ఓడిపోతే మార్కెట్ కుప్పకూలుతుందని జోస్యం చెప్పింది.

స్టాక్‌మార్కెట్ అనేది లక్షల కోట్ల రూపాయల వ్యాపారం. క్షణక్షణానికి కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయనేది రాజకీయ పార్టీలకు మించి స్టాక్‌మార్కెట్‌కు ఆసక్తి ఉంటుంది. మొదటి దశ పోలింగ్ నుంచి మార్కెట్ పడిపోతుండడాన్ని గమనిస్తే బీజేపీకి ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోవచ్చని మార్కెట్ భావిస్తున్నది. ఎన్నికల సర్వేను ఎన్నికల కమిషన్ నిషేధించినా సర్వేలు జరుగుతూనే ఉంటాయి. బడా ఇన్వెస్టర్లకు ఆ సర్వేలు చేరుతుంటాయి. దానికి తగ్గట్టు వాళ్లు ఇన్వెస్ట్‌మెంట్‌పై నిర్ణయాలు తీసుకుంటారు. మార్కెట్ సెన్సెక్స్ పడిపోతుండటాన్ని గమనిస్తే సర్వేల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనిపిస్తున్నది. సర్వేలు నిజం కావచ్చు, కాకపోవచ్చు కానీ 400 సీట్ల బీజేపీ దూకుడుకు స్పీడ్‌బ్రేక్ పడిందనే అభిప్రాయం మాత్రం కలుగుతున్నది.

400 సీట్లు అని పైకి ప్రచారం చేసుకున్నా మిత్రపక్షాలపైనే బీజేపీ మొదటి నుంచి ఆశలు పెట్టుకున్నది. బీహార్‌లో నితీష్ కుమార్‌ను తిరిగి ఎన్డీయేలో చేర్చుకొనే ప్రసక్తే లేదని హోం మంత్రి అమిత్ షా అనేక సార్లు బహిరంగ సభల్లో ప్రకటించారు. కానీ, తిరిగి చేర్చుకున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లోనైతే ప్రధాన పార్టీలు రెండింటితో బీజేపీ సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నది. చంద్రబాబు పార్టీ బీజేపీకి మిత్రపక్షం అయితే, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మోదీకి మిత్రుడు. ఏ పార్టీ గెలిచినా ఏపీ సీట్లు బీజేపీకి కొండంత అండ. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల సభల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మోదీ పల్లెత్తు మాట అనలేదు. పైకి 400 సీట్లు అని చెప్పినా అధికారంలోకి రావడానికి కనీస మెజారిటీ రాకపోతే ఉపయోగపడతారని ప్లాన్-బీ కింద కొన్ని రాజకీయ పక్షాలతో బీజేపీ సఖ్యతతోనే ఉంటున్నది.

400 సీట్లు అనే నినాదాన్ని బీజేపీనే కాదు స్టాక్‌మార్కెట్ కూడా ఎప్పుడో వదిలేసింది. మార్కెట్ పతనం తీరుతెన్నులు గమనిస్తే.. ఎలాగైనా బీజేపీ నెగ్గుతుందని, సొంత బలంతోనో, మిత్రపక్షాల బలంతోనో తిరిగి అధికారం చేపడుతుందనే ఆశలు ఇంకా స్టాక్ మార్కెట్‌ను పూర్తిగా వదలలేదన్నట్టుగానే అనిపిస్తున్నది.

అబద్ధాల కాంగ్రెస్ హరాకిరి

గొంగిడి సునీతా
మహేందర్‌రెడ్డి

దేశంలో ఎవరో ఒక మహా నాయకుడు ఎప్పుడూ మార్పు కోరుతూనే వచ్చారు. ముఖ్యంగా సమాజంలోని అసమానతలు రూపుమాపాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోరారు. అంతేకాదు, అన్ని కులాల, మతాలవాళ్లు బాగుపడాలని, అంటరానితనాన్ని పూర్తిగా అంతమొందించాలనే ఒక గొప్ప సంకల్పంతో ఆయన ఎప్పటికప్పుడు తన భావాలను ప్రకటిస్తూనే వచ్చారు. అందుకే దేశంలోని అన్నివర్గాలు సమానత్వంతో ముందుకుసాగేలా అనేక అంశాలను ఆయన రాజ్యాంగంలో పొందుపరిచారు.

స్వాతంత్ర్యానంతరం మన దేశంలో ఎన్నో ప్రభుత్వాలు కొలువుదీరినా ఎక్కడకూడా సంపూర్ణమైన మార్పు జరగలేదు. ప్రభుత్వాలు తమ రాజకీయ పార్టీలు బాగుపడటానికి, మళ్లీ మళ్లీ అధికారంలోకి రావడానికి మాత్రమే రాజ్యాంగాన్ని తమకు అనుకూలంగా వాడుకున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని, ఆయన పేరును వాడుకున్నాయే తప్ప, ఆయన ఆశయాల సాధన కోసం ఏనాడూ కృషిచేయలేదు.

జ్యోతిబా పూలే లాంటి నాయకులు ప్రతి పౌరుడు చదువుకోవాలని చెప్పారు. గ్రామస్థాయి నుంచి సమూల మార్పు రావాలని కాంక్షించారు. ధనవంతులు, జాగీర్దార్ల వద్ద ఉన్న భూములను పేద లకు పంచాలనే సదుద్దేశంతో వినోబా భావే భూదాన్ ఉద్యమాన్ని చేపట్టారు. ఏ ఉద్యమమైనా దాని అంతిమ లక్ష్యం ఒక్కటే. సమాజంలో మార్పు రావాలి, అసమానతలు తొలగిపోవాలి, అందరికీ విద్య అందాలి, అందరూ సమున్నతంగా బతుకాలన్నదే ఆ ఉద్యమ నాయకుల సంకల్పం. ఆ విధంగానే కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కూడా తెలంగాణ ప్రాంతం బాగుపడాలి, తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు రావాలని కోరుకున్నారు. మార్పు కోసం తపనపడ్డారు. ప్రజలందరినీ ఏకం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. ఆయన అంతటితోనే ఆగిపోలేదు. పోరాడి సాధించిన తెలంగాణలో, రాష్ట్ర ప్రజల జీవితాల్లో మార్పు రావాలని కోరుకున్నారు. అందరికీ విద్య, వైద్యం అందుబాటులో ఉంచాలనుకున్నారు. అందుకే ఆయన అనేక సంక్షేమ పథకాలను అమలుచేసి పేద, బడుగు, బలహీన, దళిత వర్గాల బతుకుల బాగు కోసం పరితపించారు. తనవంతు ప్రయత్నం చేస్తూనే వచ్చారు. ప్రజలు కూడా ఆ ప్రయత్నాన్ని స్వాగతించారు, అందులో భాగస్వాములయ్యారు.

కానీ, ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ నాలుగు నెలల పాలనతోనే ప్రజలు విసుగెత్తిపోయారు. మార్పు పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమే మారిపోతే బాగుండునని ప్రజలు కోరుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న నాకు ప్రజల ఆలోచనల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. నాడు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి నాయకులు కదిలితే, ఇప్పుడు నాయకులను మార్చడానికి ప్రజల్లో మార్పు రావడం నిజంగా నన్ను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. 'మాకు ప్రజల కోసం పనిచేసే నాయకుడు కావాలని, ఈ ముఖ్యమంత్రి అలా లేడని' ప్రజలు నిర్మొహమాటంగా చెప్తున్నారు.

'మా బతుకుల్లో వెలుగులు నింపాలంటే కేసీఆర్ నాయకత్వంతోనే సాధ్యమవుతుంది' అనే మాట ఇప్పుడు గ్రామాల్లో అడుగడుగునా వినిపిస్తున్నది. మళ్లీ కేసీఆర్ రావాలి, వస్తేనే తమ బతుకులు బాగుపడుతాయని ప్రజలు స్పష్టంగా చెప్తున్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారంటే పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా మార్పు వస్తుందనడంలో సందేహం లేదు.

అబద్ధాలనే పునాదులుగా చేసుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలోనూ పూటకో అబద్ధమాడుతున్నది. రైతుబంధు వేస్తున్నట్టే చేసిన రేవంత్‌రెడ్డి.. మరుసటి రోజే మాటమార్చి ఎలక్షన్ కమిషన్ అడ్డు వస్తున్నదని చెప్తూ మరోసారి ప్రజలను మోసం చేస్తున్నారు. అబద్ధాలతోనే సహవాసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారు. కాంగ్రెస్ అలవిగాని హామీలను చూసి మోసపోయిన తెలంగాణ మళ్లీ చైతన్యవంతమైంది. కేసీఆర్ నాయకత్వాన్ని మళ్లీ కోరుకుంటున్నది. ఇది యావత్ రాష్ట్రానికి శుభ పరిణామం.

(వ్యాసకర్త: మాజీ ఎమ్మెల్యే)

ఎటమటం

మేనకోడలు నవ్వినందుకే!

తనను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల కంటే తన మేనకోడలు నవ్వినందుకే ఎక్కవ బాధపడుతున్నట్టు బీజేపీ నాయకురాలు డీకే అరుణ వాపోయారు. తన తండ్రి నర్సిరెడ్డిని నాడు రేవంత్‌రెడ్డి మామ జైపాల్‌రెడ్డి రాజకీయంగా దెబ్బతీస్తే, నేడు తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. అయినా తాను భయపడటం లేదని కానీ, రేవంత్‌రెడ్డి తననుద్దేశించి చులకనగా మాట్లాడినప్పుడు వేదికపైనే ఉన్న తన మేనకోడలు, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి కనీసం ఖండించకపోగా.. నవ్వినందుకే బాధేసిందని డీకే అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడేమో తనకు మేనత్త ఆశీస్సులు ఉన్నాయని ప్రచారం చేసుకొని.. ఇప్పుడు నోరు మెదపకపోవడం అన్యాయమని అన్నారు. అంటే, అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీలో ఉండి కూడా.. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన తన మేనకోడలికి డీకే అరుణ మద్దతుగా నిలిచారన్నది నిజమేనన్నమాట.

ఛాయిస్ కోమటిరెడ్డేనా?

పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డి సర్కార్ కూలిపోతుందని బీజేపీ ఎంపీ అర్వింద్ జోస్యం చెప్పారు. కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనుకుంటే నెల రోజులు కూడా అవసరం లేదన్నారు. ఒకవేళ అర్వింద్ చెప్పిందే జరిగితే తర్వాతి సీఎం ఎవరనే దానిపై కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్నది. కాగా, తనతో పాటు సీఎం అయ్యే అర్హత కోమటిరెడ్డికే ఉందని ఇదివరకే ప్రకటించిన రేవంత్ తన ఛాయిస్‌ను బయటపెట్టారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తాను సీరియస్‌గా తీసుకోవడం లేదని ఉత్తమ్ స్పష్టం చేశారు. అది సరే మరి మీరెప్పుడు సీఎం అవుతున్నారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మీడియా అడిగితే.. ఆ సబ్జెక్టుకు ఈ ఎన్నికలతో సంబంధం లేదన్నారే తప్ప అలాంటిదేమీ లేదని ఖండించలేదంటే.. 'దాల్ మే కుచ్ కాలా..' ఉన్నట్టే!

మహాభాగ్యం.. మోదీజీ

ప్రధానిగా ఉన్న పదేండ్ల కాలంలో ఏ రోజూ ప్రెస్‌మీట్ పెట్టని మోదీ, ఎన్నికల పుణ్యమా అని తెలుగు చానల్స్‌కు కూడా ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. నంబర్ వన్ చానల్ అని చెప్పుకొనే ఒక చానల్‌కు ఇటీవల మోదీ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. వారు 20 ప్రశ్నలు పంపిస్తే, వాటిలో ఎనిమిది తీసేసి 12 ప్రశ్నలకు ఓకే చేశారు. దాదాపు గంటపాటు సాగిన ఇంటర్వ్యూను పీఎం మీడియా విభాగం సెన్సార్ చేసి అరగంటకు కుదించింది. దాన్ని సదరు చానల్‌కు తిరిగి అందజేసినట్టు సమాచారం. 'చారాణ కూరకు బారాణ మసాలా' అన్నట్టు.. ఆ చానల్ ఏమో భారీ ప్రోమో తయారు చేసుకుంది.

అవి ఇచ్చి పోరాదే...

పోలింగ్ ముగిసిందంటే అభ్యర్థులు ఇరవై రోజుల దాకా అతాపతా ఉండరు. తిరిగి వారి దర్శన భాగ్యం కలిగేది 20 రోజుల తర్వాత కౌంటింగ్‌కు ముందురోజే. ఎన్నికల బడలిక నుంచి సేద తీరేందుకు సుదూర తీరాలకు ట్రావెలింగ్, హోటళ్లను కొందరు ముందే బుక్ చేసుకోగా, కొందరేమో చేయాల్సిందంతా చేసేశాం.. 'ఇక మీ దయ' అంటూ భగవంతుడిపై భారం వేసి తీర్థయాత్రలకు బయలుదేరనున్నారు. ఇది ప్రతి ఎన్నికలలో జరిగేదే. కానీ, ఈ సారి పోలింగ్‌కు, కౌంటింగ్‌కు మధ్య వ్యవధి ఎక్కువగా ఉండటంతో ప్రచార రథాలు, మైకులు, డీజేలు, జెండాలు, కరపత్రాలు, పోస్టర్లు తదితర సామగ్రి సమకూర్చినవారు.. అభ్యర్థుల నుంచి ముందే డబ్బులు రాబట్టుకునే పనిలో పడినట్టు సమాచారం. 'టూర్‌కు వెళ్లేక ముందే.. గవి ఇచ్చి పోరాదే' అని వెంటపడినట్టు ఓ అభ్యర్థి వాపోయారు.

- వెల్జాల